ఐటీ ఉద్యోగులు గర్వకారణం

- ఐటీకి నిజమైన ప్రతిభ, అంకితభావం అవసరం
- డబ్బు సంచులతో ఎమ్మెల్యేలను కొనే వారికి ఢిల్లీ బాసులకు మూటలు పంపేవారికి అక్కర్లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): 'ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఐటీ పరిశ్రమల్లో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం అనేవి చాలా అవసరం. కానీ, సంచుల కొద్దీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనేందుకు, ఢిల్లీ బాసులకు డబ్బుల మూటలు పంపడానికి ఇవేమీ అవసరం లేదు' అని ఎద్దేవాచేశారు. తనను ఒక ఐటీ ఉద్యోగి అని మాట్లాడిన వారికి ఆయన ధీటైన సమాధానం చెప్పారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌వేదికగా ఆయన స్పందించారు. 'నన్ను ఒక ఐటీ ఉద్యోగి అని మాట్లాడొచ్చని అనుకునేవాళ్లకు నేను ఒక్కటే చెప్పదలుచుకున్నా. ఐటీ పరిశ్రమలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం అనేవి చాలా అవసరం. కానీ, ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకి డబ్బులు పంపడానికి ఇవేమీ అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఐటీ, అనుబంధ సంస్థల్లో ఉన్న నా అక్కా చెల్లెండ్లకు, అన్నదమ్ములకు సలాం. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక. మీరు లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ విద్యార్హతలకు, మీ నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్లు ప్రవేశపట్టే అనాలోచిత విధానాలకు మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నం. నా విద్యార్హతలు, నా ఉద్యోగ అనుభవం, ఐటీలో నా నేపథ్యం, ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం' అని స్పష్టం చేశారు.

ఐటీ ఉద్యోగులకు సీఎం సారీ చెప్పాలి

- దేశప్రగతికి తోడ్పడుతున్న ఉద్యోగులు
- వారి శ్రమకు సీఎం రేవంత్‌రెడ్డి అవమానం
- రాష్ట్ర ప్రతిష్ఠ దిగజారేలా వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఐటీ ఉద్యోగులపై చేసిన కురచ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, వారికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ప్రపంచ వేదికపై ఒక ముఖ్యమంత్రిగా ఐటీ ఉద్యోగులను కించపర్చారని మండిపడ్డారు. వారిని అవమానిస్తూ మాట్లాడటాన్ని ఓయూ ప్రొఫెసర్‌గా, ఐటీ పరిశ్రమలో దశాబ్దాలపాటు మానవ వనరుల అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తిగా, ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతగా తాను ఖండిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్ఎస్ నేతలు తుంగ బాలు, బమ్మెర రామ్మూర్తి, ఫయాజ్ అహ్మద్, కాంచన ముదిరాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ ఉద్యోగులను అవమానకరంగా వ్యాఖ్యనించిన రేవంత్‌రెడ్డికి తాను బహిరంగ లేఖ రాశానని చెప్పారు. ఐటీ ఉద్యోగులు సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, దేశ జీడీపీలో ఐటీ రంగం వాటా 10 శాతం పైనే ఉన్నదని చెప్పారు. దేశప్రగతికి విశేషంగా తోడ్పడుతున్న ఐటీ ఉద్యోగులను కించపరిచేలా రేవంత్‌రెడ్డి మాట్లాడటం తగదని హితవు పలికారు. సీఎం వ్యాఖ్యలను ఐటీ సంస్థలు ఖండించాలని పేర్కొన్నారు. ఫ్యూడల్ మనస్థత్వంతో రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

కేటీఆర్ కృషితోనే తెలంగాణకు సంపద

కేటీఆర్ కృషితోనే బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, హైదరాబాద్‌ను ఐటీ ప్రపంచ చిత్రపటంలో ఆయన నిలిపారని, ఈ పరంపరలో లక్షల మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయని దాసోజు శ్రవణ్ గుర్తుచేశారు. కేటీఆర్ డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేయలేదని, ఓ సంస్థ అమెరికా మార్కెటింగ్ విభాగానికి అధిపతిగా పనిచేశారని తెలిపారు. లక్షల్లో ఉన్న వేతనాన్ని వదిలి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. కేటీఆర్‌ను చులకనగా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి ఎక్కడి నుంచి వచ్చారని, పెయింటర్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం ఎలా అయ్యారని ప్రశ్నించారు. దావోస్‌లోనే ఉన్న చంద్రబాబు అయినా రేవంత్‌రెడ్డికి గడ్డిపెట్టాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట ఎవరుంటున్నారో, ఏ సలహాలు ఇస్తున్నారో అర్థంకావడం లేదని, సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి రాష్ట్ర పరువును అన్ని వేదికలపైన మంటగలుపుతున్నారని విమర్శించారు.

లోకం పోకడ

అమెరికా చలికి గడ్డకట్టిపోయాడు.. ట్రంప్ నిర్ణయాలతో భగ్గున ఒళ్లుమండి నీరుగారి పోయాడు!

రేవంత్‌రెడ్డీ.. వ్యాఖ్యలు వెనక్కి తీసుకో!

రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఐటీ ఉద్యోగులను అవమానకరంగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నత చదువులతో ఐటీ ఉద్యోగాలు చేస్తున్న వారిని తూలనాడటం తగదని హితవు పలికారు. 'కంప్యూటర్ మీద పనిచేసే వాళ్లు వర్కర్స్ మాత్రమే అంటూ.. ఐటీ ఉద్యోగులను కించపరిచేలా దావోస్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. సీఎం హోదాలో ఉండి ఒక అంతర్జాతీయ వేదికపై ఇలా మాట్లాడటం.. రాష్ట్రం పరువు తీయడమేనని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ చదివే వాళ్లు, ఐటీ ఉద్యోగులు డ్రగ్స్ అమ్ముతున్నారంటూ గతంలో మాట్లాడారని, ఇంజినీర్ల కంటే మేస్త్రీలు ఎక్కువ సంపాదిస్తున్నారంటూ చలకనగా మాట్లాడారని తెలిపారు. తరచూ విద్యావంతులను తక్కువ చేసి మాట్లాడటం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ప్రపంచం ముందు తెలంగాణ ఠీవిగా నిలబడిదంటే అది ఐటీ చలవేనని పేర్కొన్నారు.

నేడు ఆదిలాబాద్‌కు బీఆర్ఎస్ రైతు కమిటీ

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి పరామర్శ • పంటల పరిశీలన, రైతులతో సమావేశం

ఆదిలాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ పర్యటన నేటి నుంచి ప్రారంభంకానుంది. నెలపాటు జరిగే పర్యటనలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ కమిటీ పర్యటించనున్నది. జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన రైతు దేవ్‌రావ్ కుటుంబాన్ని పరామర్శించి రామాయిలో, యాపల్‌గూడలో రైతులతో సమావేశం కానున్నది.

జిల్లాలో 33 మంది రైతుల ఆత్మహత్య

ఆదిలాబాద్ జిల్లాలో 13 నెలలల్లో 33 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బ్యాంకు అధికారుల వేధింపులు భరించలేక దేవ్‌రావు బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. 30 వేల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కావాల్సి ఉండగా, రెండు పంటలకు రైతు భరోసా అందలేదు. దీంతో రైతులు సాగు కోసం బ్యాంకులు, ప్రైవేటు, దళారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తున్నది. దిగుబడులు లేక అప్పులు తీర్చక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. 90 శాతం రైతులు పత్తి సాగు చేస్తారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521తో కోనుగోలు చేయాల్సిన సీసీఐ రైతులను నట్టేట ముంచుతున్నది. నాణ్యత పేరిట క్వింటాలుకు రూ.100 తగ్గించి ,421తో కొనుగోలు చేస్తున్నది.

గీతవృత్తిదారులపై దాడులు దుర్మార్గం

గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కల్లుగీత వృత్తిదారులపై గ్రామ అభివృద్ధి కమిటీలు(వీడీసీ) చేస్తున్న దాడులు దుర్మార్గమని, ప్రభుత్వం తక్షణమే వెంటనే జోక్యం చేసుకొని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో అనధికారికంగా గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటుచేయడమే కాకుండా కమిటీల పేరిట కొందరు అనేక ఆగడాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీడీసీలు గీత వృత్తిదారుల జోలికి వస్తే ఊరుకునేది లేదని వీడీసీలను హెచ్చరించారు. ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని, ఆత్మగౌరవ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

ఇకపై రాజకీయ విమర్శలు చేయను

- అభివృద్ధిపైనే దృష్టిపెడతా
- కేంద్రమంత్రి బండి సంజయ్
- నిధులు తెచ్చి అభివృద్ధి చేశా: గంగుల

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 23 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇకపై రాజకీయ విమర్శలు చేయనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అభివృద్ధి కోసం అందర్నీ కలుపుకొని పోతానని స్పష్టంచేశారు. స్మార్ట్‌సిటీలో భాగంగా కరీంనగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్‌రావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం అడుగుతామని, అవసరమైతే కొట్లాడి సాధించుకుందామని తెలిపారు. జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి కరీంనగర్ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అందరం కలిసి పని చేద్దామని సూచించారు. వరంగల్‌కు దీటుగా కరీంనగర్ అభివృద్ధి చెందుతుందని, ఇందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కరీంనగర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశా..

కరీంనగర్ అభివృద్ధికి అనేక నిధులు తెచ్చి ఎన్నో పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. తాము చేపట్టిన అనేక అభివృద్ధి పనుల పూర్తికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని బండి సంజయ్‌ని కోరారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర నిధులతోపాటు కేంద్ర నిధులు రావడంతో అభివృద్ధి సాధించినట్టు తెలిపారు.

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రేవెల్లి మినీ ట్యాంక్ బండ్‌లో ఉన్న మోటర్లను తొలగించాలని నిరసన చేస్తున్న మూడు గ్రామాల రైతులు

మోటర్లు తొలగించాలని రైతుల ఆందోళన

- రేవెల్లి మినీ ట్యాంక్ బండ్‌పై నిరసన
- బీఆర్ఎస్ హయాంలోనే నీళ్లు పుష్కలం
- ఇప్పుడేమో చెరువులన్నీ ఖాళీ
- కరీంనగర్ జిల్లా చిట్యాపల్లి, రాగంపేట, దేశాయిపేట రైతుల ఆవేదన

చొప్పదండి, జనవరి 23: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రేవెల్లిలోని చెరువులో ఉన్న మోటర్లను తొలగించాలని చిట్యాపల్లి, రాగంపేట, దేశాయిపేట గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు మినీ ట్యాంక్ బండ్‌పై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎల్లంపల్లి పైపులైన్ నుంచి మినీ ట్యాంక్‌బండ్ చెరువుకు నీరు పుష్కలంగా ఉండేదని, ఆయకట్టుకు నీరు అందిసాగు చేసుకున్నట్టు తెలిపారు. చెరువులో ఇప్పుడు నీరు లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటిని చెరువుపై ఉన్న గ్రామస్తులు మోటర్లు పెట్టుకొని పంపింగ్ చేసుకోవడంతో కింది సమస్య వస్తుందని చెప్పారు. చెరువులో నీరు లేక చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే మినీ ట్యాంక్ బండ్ చెరువు నింపి ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. సీఐ ప్రకాశ్ గౌడ్, ఎస్సై అనూష ఘటనా స్థలానికి వెళ్లి ఇరు గ్రామాల రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెద్దకొత్తపల్లి, జనవరి 23 : విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం మారెడుమాన్‌దిన్నె గ్రామ పంచాయతీ వేడుకరావుపల్లి తండాకు చెందిన అమ్రునాయక్ (63)కు ఐదెకరాల పొలం ఉన్నది. ఇందులో మినుములు సాగు చేశాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం 10 గంటలకు పంటకు నీళ్లు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. బోరు స్టార్టర్ వద్ద కరెంట్ వైర్ తెగి ఉండగా.. గమనించకుండా మోటర్ ఆన్ చేసే క్రమంలో వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు.

బీసీ 'స్థానిక' రిజర్వేషన్ల పెంపు ఇంకెప్పుడు?

- రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకపోతే ఊరుకునేది లేదు
- కాంగ్రెస్ సర్కారు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాల్సిందే
- ముఖ్యమంత్రి రేవంత్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే అంశాన్ని ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆమె సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి, 2024-25 బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీవర్గాల్లో విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పించడం. కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు' అంశం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఉన్నదని ఆమె గుర్తుచేశారు. 'ఇప్పటికీ ఏడాది గడిచింది.. రిజర్వేషన్ల పెంపు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తున్నది' అని అనుమానం వ్యక్తంచేశారు.

కులగణన పూర్తయినా బహిర్గతం చేయరెందుకు?

కులగణన పూర్తయి చాలాకాలం అవుతున్నదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎమ్మెల్సీ కవిత దుయ్యబట్టారు. కులగణన వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'బీసీల అంశాల పట్ల ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తున్నది? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన? ఆరు నెలల్లోపే అమలుచేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలుచేయడం లేదు? హామీని అమలుచేయడానికి ఇంకెంత కాలం పడుతుంది? అని ప్రశ్నించారు.

> బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందే. కుంటిసాకులు చెప్పి ఇచ్చినమాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం కాంగ్రెస్ సర్కార్‌ను సహించబోం. బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రేవంత్‌రెడ్డి మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటాం.
> - కల్వకుంట్ల కవిత

మెడలు వంచి సాధిస్తాం

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడాది పూర్తయ్యిందని, మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగిసిందని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాపాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నదని కవిత గుర్తుచేశారు. ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న ఉద్దేశం లేన్నట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

గోవిందరావు (ఫైల్)

సారయ్య (ఫైల్)

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

అప్పుల బాధతో ఆదిలాబాద్ జిల్లాలో ఒకరు

పరిహారం అందక హనుమకొండ జిల్లాలో మరొకరు

ఇప్పటికి రాలిన మట్టిపూలు 408

ఆదిలాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ)/ హసన్‌పర్తి: మరో ఇద్దరు రైతులు గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధ భరించలేక ఆదిలాబాద్ జిల్లాలో కౌలు రైతు, జాతీయ రహదారి నిర్మాణంలో భూమిని కోల్పోయినా పరిహారం అందక మనస్తాపంతో హనుమకొండ జిల్లాలో మరో రైతు తనువు చాలించారు. వివరాలు ఇలా.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం శంషాబాద్ గ్రామానికి గోవిందరావు (37) 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, సోయాబీన్, కంది పంటలు వేశాడు. పంటల సాగుకోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. దిగుబడులు రాక నష్టం రావడంతో అప్పులు తీర్చలేకపోయాడు. తీవ్ర మనస్తాపం చెందిన గోవిందరావు గురువారం సాగుచేస్తున్న వ్యవసాయ భూమిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వారికి ప్రకటించిన సాయం వెంటనే అందజేయాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. నేడు జిల్లాలో పర్యటించనున్న బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ గోవింద్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్టు తెలిపారు.

హసన్‌పర్తిలో రైతు సారయ్య..

రహదారి నిర్మాణంలో భూమిని కోల్పోయినా పరిహారం అందక తీవ్ర మనస్తాపానికి గురైన హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన గొర్రె సారయ్య (57) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. సారయ్యకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 63/ఏలో 32 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. ఆ భూమి జాతీయ రహదారిలో పోయింది. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదు. మిగతా వారికి పరిహారం అందినా తనకు రాకపోవడంతో సారయ్య మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించగా సారయ్య అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

ఫార్మాసిటీ రద్దయినట్టే?

మొదటిపేజీ తరువాయి...

ప్రజలు లేని ప్రాంతాల్లో ఉండాలి. ఎవరెన్ని అన్నా.. మేం వచ్చిన మూడు రోజులకే నిర్ణయం తీసుకున్నం...' రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్లలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. ప్రజలనుద్దేశించి ఫార్మాసిటీ రద్దు నిర్ణయం ఇప్పటికే తీసుకున్నట్టు ఆయన బహిరంగంగా ప్రకటించారు. కానీ, నిబంధనల ప్రకారం ఫార్మాసిటీ రద్దు అయినందున రైతుల నుంచి సేకరించిన భూముల్ని తిరిగి వారికి ఇచ్చేందుకు మాత్రం ప్రభుత్వం ససేమిరా అంటున్నది. అంతేకాదు, అసలు ఫార్మాసిటీని రద్దు చేయలేదని, అక్కడే ఏర్పాటు చేస్తున్నామంటూ హైకోర్టులో అధికారికంగా అఫిడవిట్ సమర్పించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేస్తున్న తీరు మంత్రుల ప్రకటనల రూపంలో మరోసారి బహిర్గతమైంది. దీంతో హస్తం ప్రభుత్వంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

14 వేల ఎకరాలపై సర్కారు కన్ను

పూటకో మాట.. రోజుకో నిర్ణయం.. హైకోర్టుకు చెప్పేదొకటి.. ప్రజలకు చెప్పేది మరొకటి.. ముఖ్యమంత్రి ఒకటంటే.. మంత్రులు ఇంకొకటంటరు.. ఇదీ ఫార్మాసిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ఆడుతున్న డ్రామా. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో కేసీఆర్ ప్రభుత్వం తలపెట్టిన ఫార్మాసిటీ ఏర్పాటుపై రేవంత్ సర్కారు దోబూచులాడుతున్నది. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం రెండు నియోజకవర్గాల పరిధిలోని అనేక గ్రామాల్లో కేసీఆర్ ప్రభుత్వం 14 వేల ఎకరాలకు పైగా భూముల్ని సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు సంతృప్తికరంగా నష్టపరిహారం ఇవ్వడంతో పాటు అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో వారికి ఎకరానికి 121 చదరపు గజాల చొప్పున ప్లాట్లు కూడా ఇచ్చింది. అంతేకాదు, ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేసింది. ఆయా గ్రామాల పరిధిలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. కానీ, 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడు రోజులకే ఫార్మాసిటీని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చడంతోపాటు భట్టి మొదలు ఇప్పుడు మంత్రులుగా ఉన్న చాలా మంది కాంగ్రెస్ నేతలు ఈ మేరకు హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని రైతులు కోరుతుంటే మాత్రం కనీసం వారికి సమయం ఇవ్వకపోవడం గమనార్హం. అంతేకాకుండా తమ డిమాండ్లను వినిపించేందుకు అనుమతులు కూడా ఇవ్వకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారు.

సర్కారు ద్వంద్వ వైఖరి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు రోజులకే ఫార్మాసిటీ రద్దు నిర్ణయం తీసుకున్నది వాస్తవం. ఈ మేరకు సీఎంవో నుంచే పత్రికా ప్రకటన విడుదలైంది. కానీ, రోజుల వ్యవధిలోనే మాట మార్చి.. ఫార్మాసిటీ రద్దు చేయడం లేదని చెప్పారు. ఈ మేరకు సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భిన్నమైన ప్రకటనలు చేశారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు అక్కడే వివిధ రకాల ఫార్మాయేతర కంపెనీలు, యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో భూసేకరణ సమయంలో 'ఫార్మాసిటీ కోసమే భూముల్ని సేకరిస్తున్నాం' అనే నిబంధన ఉన్నందున, ఎలాగూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీ రద్దు చేసినందున తమ భూములు తమకు వస్తాయని రైతులు ఆశగా ఎదురుచ